క్లుప్తంగా

వాజ్‌పేయి సేవలు మరువలేనివి



వాజ్‌పేయికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

మల్కాపురం: మాజీ ప్రధాని వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు మరువలేనివని బీజేపీ సిటీ ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయబాబు అన్నారు. వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని 59వ వార్డు శాంతిగిరికాలనీలో ఏర్పా టు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి, వక్త అయిన వాజ్‌పేయి భావితరాలకు స్ఫూర్తిప్రదాత అని కొనియాడారు. స్థానిక నాయకులు సతీష్, హేమారావు, అప్పారావు పాల్గొన్నారు.

అధ్వానం.. అస్తవ్యస్తం!



కార్యాలయం ఆవరణలో పందుల సంచారం

- ఆవరణలో పందులు, కుక్కల సంచారం
- బీటలు వారిన గోడలు
- కళ తప్పిన ములగాడ తహసీల్దార్ కార్యాలయం
- తరలించాలని విన్న వించుకున్నా కానరాని స్పందన



మరుగుదొడ్డికి వెళ్లే మార్గం ఇలా



ములగాడ తహసీల్దార్ కార్యాలయం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలోని తహసీల్దార్ కార్యాలయం కుక్కలు, పందులకు ఆవాసంగా మారింది. పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల ప్రజలకు సేవలందిస్తున్న మండలమేజిస్ట్రేట్ కార్యాలయం అధ్వానంగా ఉంది. కార్యాలయం గోడలు బీటలు వారాయి. శ్లాబ్ డూమ్ ఊడి పడుతోంది. పందులు,వీధి కుక్కలు కార్యాలయానికి వచ్చే దరఖాస్తు దారులతో పాటు అధికారులను ఇబ్బందికి గురి చేసే విధంగా ప్రవర్తిస్తుంటాయి.

ముక్కు మూసుకోవాల్సిందే..

మరుగుదొడ్లులకు వెళ్లే మార్గం చాలా అసౌకర్యంగా ఉంది. ఇక్కడ గెడ్డ నిర్మాణం కోసం తవ్వన వ్యర్థాలను సదురు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా విడిచి పెట్టడంతో మార్గం అసౌకర్యంగా ఉంది. నిత్యం సమస్యలు వేధిస్తుండడంతో కార్యాలయాన్ని వేరే చోటకు తరలించాలని ఉన్నతాధికారులకు వివరించారు. దీనిపై ఎలాంటి స్పందన రాకపోవడంతో వారు నిరాశగా ఉన్నారు. కార్యాలయాన్ని ఇక్కడ నుంచి తరలి వెళ్తే గానీ సమస్యలు పరిష్కారం కావని ఇక్కడ సిబ్బంది పేర్కొంటున్నారు.



తహసీల్దార్,డీటీ ఉన్న గదుల ముందు కుక్కలు

తాత్కాలిక దుకాణాలతో తలనొప్పి!

- పరిశుభ్రత పాటించని వ్యాపారులు
- చెత్తపేరుకుపోవడంతో తొలగించిన శానిటరీ సిబ్బంది



దుకాణాల వద్ద వ్యర్థాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



పేరుకు పోయిన వ్యర్థాలు



రద్దీగా ఉన్న రైతు బజారు రోడ్డు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారుకు ఆనుకుని 30 పడకల ఆస్పత్రికి వెళ్లే దారిలో దుకాణాలు నిర్వహిస్తున్న వారు పరిశుభ్రతను గాలికి వదిలేస్తున్నారు. పండ్లు, కాయగూరల వ్యాపారులు చెత్తాచెదారాలను అక్కడే పడేస్తున్నారు. అవి పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇది గమనించిన పారిశుద్య అధికారులు శనివారం దుకాణాల వద్ద వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టారు. దుకాణాలను తొలగించి వాటి వెనుక ఉన్న వ్యర్థాలను వెలికి తీశారు.ఈ చర్యలు ఆదివారం కూడా కొనసాగుతాయని సిబ్బంది తెలిపారు. దుకాణాలు గోడకు ఆనుకుని ఉండాలని రోడ్డు మీదకు రావద్దని హెచ్చరించారు.

వ్యర్థాలన్నీ రైతు బజారులోకే...

రైతు బజారు గోడకు ఆనుకుని ఉన్న దుకాణదారులు వ్యాపారంలో వచ్చే వ్యర్థాలను రైతు బజారులోకి వేస్తున్నారు. దీంతో రైతు బజారు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే విధంగా వ్యవహరిస్తే దుకాణాలను తొలగిస్తామని రైతు బజారు ఈవో ప్రసాద్ హెచ్చరించారు.

పరిశుభ్రత పాటించని దుకాణదారులు

దుకాణదారులు పరిశుభ్రంత పాటించరని వినియోగదారులు వాపోతున్నారు. డంపర్‌బిన్లు ఉన్నా, ప్రతీ రోజు పారిశుద్య కార్మికులు చెత్త సేకరిస్తున్నా.. వీరు పట్టించుకోరు .సాయంత్రం అయ్యే సరికి వ్యర్థాలు ఇష్టాను సారంగా పడేస్తున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఇవి కుళ్లి దోమల ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. పరిశుభ్రత పాటించకపోతే దుకాణాలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నందనందనా..

కృష్ణాష్టమి పర్వదినాన్ని వాడవాడలా కనులపండువగా నిర్వహించారు. యశోదాదేవి ముద్దుల తనయుడు, నందనందనుడిని చూడచక్కగా అలంకరించి.. విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. నివాసాల వద్ద బాలకృష్ణుడి పాదముద్రికలను గడప నుండి దేవుడి మందిరం వరకు వేసి, అక్కడ చిన్నికృష్ణుడిని ప్రతిష్టించి పూజలు చేశారు. చిన్నారులు బాలకృష్ణుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు.



కొత్తపాలెంలో బాలగోకులం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

- కనులపండువగా కృష్ణాష్టమి వేడుకలు
- శ్రీకృష్ణుడికి విశేష అభిషేకాలు
- చిన్నికృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులు



పాతగోపాలపట్నంలో విశేషాలంకరణలో వేణుగోపాలుడు



చిన్ని కృష్ణుని వేషధారణలో ముచ్చట గొలుపుతున్న చిన్నారి



మల్కాపురం, గొల్లవీధి వద్ద శ్రీకృష్ణుడికి పూజలు



వెంకటాపురం ఆలయంలో స్వామిని దర్శించుకున్న దొడ్డి కిరణ్



ఆర్‌కే పురం వద్ద ప్రత్యేక అలంకరణలో నందనందనుడు



పూజల్లో పాల్గొన్న ఉరుకూటి చందు తదితరులు



నక్కవానిపాలెం వద్ద పూజల్లో పాల్గొన్న శ్రీకృష్ణ యాదవ యువజన సేవాసంఘం ప్రతినిధులు



త్రినాథపురం కృష్ణుడి ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు



మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో కృష్ణయ్యకు పూజలు



ఉట్టి కొడుతున్న భక్తులు

గోపాలపట్నం: శ్రీకృష్ణుడి జన్మాష్టమిని పశ్చిమ నియోజకవర్గ పరిధిలో శనివారం ఘనంగా జరుపుకొన్నారు. జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో, 91,89 వార్డుల్లోని శ్రీ కృష్ణాలయంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. పలు వైష్ణవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

కొత్తపాలెంలో పోటీలు...

జీవీఎంసీ కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నికృష్ణుల పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరయిన తల్లిదండ్రులు చిన్నారులను కృష్ణుడి వేషధారణలో తీసుకువచ్చారు. వారి అల్లరితో ప్రాంగణమంతా సందడి నెలకొంది. పలువురు చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గొల్ల కంచరపాలెంలో..

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలోని శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ఆలయ గౌరవ చైర్మన్ సర్వసిద్ధి ఉమమహేశ్వరరావు, గౌరీశంకర్ దంపతులు తొలిపూజ చేశారు. తెల్లవారు జామున 5 గంటల నుంచి భక్తులు స్వామివారికి విశేష పూజలు చేశారు. పలువురు నాయకులు, గ్రామ పెద్దలు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ జరిగింది. అధ్యక్షుడు పల్లా ఎర్నికుమార్, ఉపాధ్యక్షుడు కొయ్య శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొయ్య జగదీష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి వద్ద శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు ఉరుకూటి చందుయాదవ్ పాల్గొని కృష్ణుని ఉత్సవ విగ్రహానికి పాలు, పెరుగుతో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. వెంకన్నపాలెంలోని శ్రీకృష్ణుని మందిరంలో జరిగిన పూజల్లోనూ ఉరుకూటి చందు పాల్గొన్నారు.

- ప్రకాష్‌నగర్ వద్ద గల వేణుగోపాల ఆలయంలో కొలువుదీరిన శ్రీకృష్ణునికి ఆలయ అర్చకులు, యాదవ సంఘం ప్రతినిధులు పూజలు జరిపారు.
- 59వ వార్డు కొత్తనక్కవానిపాలెం గ్రామం వద్ద శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో మౌర్య సింహ, నక్క లక్ష్మణరావు పాల్గొని శ్రీకృష్ణుని పాలు పెరుగుతో అభిషేకించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉరుకూటి బంగార్రాజు, కిలాడి పైడిరాజు, ఉరుకూటి హరిబాబు, డొంకాన రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్, త్రినాథపురం ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఉట్టి కొట్టే వేడుకను యువకులు కోలాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకాష్‌నగర్ ఆలయ నిర్వాహకులు చట్టి నూకరాజు, 61వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జీవీఎస్ఎస్ రాజు(కేబుల్ రాజు), టీడీపీ కాలనీ గ్రామాభివృద్ధి సంఘం ప్రెసిడెంట్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, త్రినాథపురం ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో..

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రి పాలెం వుడా లేఅవుట్ శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిటీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ శిరీష పర్యవేక్షణలో కృష్ణుడికి పూజలు చేసి, ఊయల సేవ నిర్వహించారు. సంతోషి, హేమంత్ పర్యవేక్షణలో ఉట్టి సంబరం నిర్వహించారు. చైతన్య డ్యాన్స్ స్కూల్ విద్యార్థుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ డి.సూర్యనారాయ ణ, వైస్ చైర్మన్ ప్రసా ద్ రెడ్డి, కార్యదర్శి ఐ.వి.శంకరరావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి ఘనంగా శ్రావణ పూజలు



సిరులతల్లికి తులసి దళాలతో పూజ చేస్తున్న అర్చకులు, భక్తులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు శనివారంతో 23వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య పూజలు ప్రారంభించారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు, ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసి పూజ

సిరులతల్లి కనకమహాలక్ష్మికి శనివారం తులసి దళాలతో పూజ చేశారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు, శ్రీచక్ర నవావర్ణార్చన, లక్ష్మీ హోమంలో ఇద్దరు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో రూ.1,000 పూజా రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చని ఈవో శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006681, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌరులందరికీ ఓటు హక్కు కల్పించాలి

- బిహార్‌లో 65 లక్షల ఓట్ల తొలగింపు అన్యాయం
- ధర్నాలో సీపీఎం, సీపీఐ నాయకులు



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు, సభ్యులు

బీచ్‌రోడ్డు : దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజల ఓటు హక్కు ఖూనీని కేంద్ర ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ బిహార్‌లో ఎన్నికల కమిషన్ 65 లక్షల ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే అన్నారు. ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు చెల్లుబాటు కావని చెప్పడం, ఓటరే పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని చెప్పడం దారుణమన్నారు. ఈసీ జారీ చేసిన ఓటర్ గుర్తింపు కార్డుతో దశాబ్దాలుగా ఓట్లు వేస్తున్న వారికి, ఇప్పుడు ఆ గుర్తింపు కార్డు చెల్లుబాటు కాదని ప్రకటించడం సరికాదన్నారు. ఈ అక్రమ నిబంధనలు రద్దు చేయాలని, పౌరులందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేసి, దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈడీ, సీబీఐలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడం తీవ్రం చేసిందన్నారు. స్వతంత్రంగా వ్యవహరిస్తూ, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని... కేంద్ర ప్రభుత్వ తీరుతో ఈసీ స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఎన్నికల వ్యవస్థను కూడా తమకు అనుకూలంగా మార్చుకుని దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ లక్ష్యం ప్రకారం దేశంలో అధ్యక్ష తరహా పాలనకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల ఓట్ల తొలగింపు కేవలం బిహార్, కర్ణాటక, మహారాష్ట్రకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా ఇటువంటి అక్రమాలకు పాల్పడతారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా నడుము బిగించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.మణి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న బీజేపీ పాలనను ప్రజలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు వి.కృష్ణారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.జగన్, బి.ఈశ్వరమ్మ, ఎం.సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు క్షేత్రపాల్ రెడ్డి, ఎం.మన్మధరావు, ఎం.రాంబాబు, కె.వనజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేంపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

కొబ్బరి చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



నడుపూరు వెంకటరావు మృతదేహం

పెదగంట్యాడ: మండలంలోని సమతానగర్ షిర్డీ శాంతిధామం సమీపంలో శనివారం కొబ్బరిచెట్టు పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. న్యూ పోర్టు పోలీసులు అందించిన వివరాలివి.. మండలంలోని నడుపూరులో నడుపూరు వెంకటరావు (48) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వర్తించేవాడు. నాలుగు నెలల కిందట స్టీల్‌ప్లాంట్‌లో విధుల నుంచి తొలగించడంతో కూలి పనులకు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో సీతానగరం ప్రాంతానికి చెందిన అచ్చంనాయుడు అనే వ్యక్తి పరిచమయ్యాడు. ఆయనతో కలిసి వెంకటరావు కొబ్బరి కాయలు తీసేందుకు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం కూడా వెంకటరావు కొబ్బరికాయలు తీసేందుకు వెళ్లాడు. అయితే శనివారం వర్షం పడడంతో కొబ్బరి చెట్టు ఎక్కిన తర్వాత పట్టు జారి ఒక్కసారిగా కిందపడిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య నడుపూరు మణి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

గోపాలపట్నం: ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ గణబాబు చెక్కులను ఆయన కార్యాలయంలో అందించారు. జీవీఎంసీ 91వ వార్డుకు చెందిన మద్దు బుజ్జికి రూ. 27,114, 92వ వార్డు దాసరి తాతారావు రూ. 20,227, గొందేశి వెంకటరమణకు రూ.15వేల చెక్కులను అందించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు శరగడం అరుణ్‌కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



పెంటయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం : పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు జ్యోతిర్గమయ కార్యక్రమంలో భాగంగా యాచకులను పునరావాస కేంద్రాలకు తరలించారు. భీమనగర్ పురుషుల నిరాశ్రయుల వసతి గృహంలో ఉన్న పిల్లి పెంటయ్య(68)ను శనివారం సాయంత్రం టూ టౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొన్ని రోజులుగా ఇల్లు విడిచి తిరుగుతున్న పెంటయ్యను గుర్తించి పోలీసులు ఇక్కడికి తీసుకొచ్చారు. పెంటయ్య వివరాలను సీఐ ఎర్రం నాయుడు ఆరా తీయగా... కంచరపాలెం ప్రాంతానికి చెందిన వాడిగా తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అప్పగించారు. సీపీకి, సీఐకి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.